## క్లుప్తంగా

### మూలన పడిన అంబులెన్స్

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారానికి చెందిన అంబులెన్స్ రెండు నెలలుగా మూలనపడిందని సిబ్బంది వాపోతున్నారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ కర్మాగారంలో ఉద్యోగులు, కార్మికులు కలిపి సుమారు 2 వేల మంది విధులు నిర్వర్తిస్తుంటారు. కర్మాగారంలో అనుకోని ప్రమాదాలు జరిగితే వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ ఉంది. కానీ, అది దెబ్బతినడంతో యూసీబీ హాల్ వెనుక పక్కకు పెట్టారు. అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో షిఫ్టులవారీగా విధులు నిర్వర్తించే ఐదుగురు డ్రైవర్లు ఖాళీగా ఉంటున్నారు. సమయానికి వచ్చి వెళ్లి పోతున్నారు. వీరి విధులు సైతం వృథా అవుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయమై సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

### నేడు కంటి వైద్యశిబిరం

పాల్వంచ: స్థానిక పెన్షనర్స్ భవనంలో మంగళవారం శరత్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఉంటుందని రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతోజు బ్రహ్మారావు, షాబుద్దీన్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి, విద్యుత్ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఈ వైద్యశిబిరంలో పాల్గొనాలని కోరారు.

### పర్ణశాలలో డోలోత్సవం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీపూజ చేశారు. గ్రామంలోని ముత్తయిదువుల చేత పసుపు కొట్టించి, తలంబ్రాలు కలిపించారు. అనంతరం మూలవర్లకు ఉత్సవమూర్తులకు వసంతోత్సవం సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం స్వామి వారిని పెళ్లి కొడుకును చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువారాధన, తిరువీధి సేవ, విశేష ప్రసాదం నివేదన చేశారు. కార్యక్రమంలో అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, అమరవాది వెంకట్రామన్ భార్గవాచార్యులు, సూపరింటెండెంట్ కిషోర్, అనిల్, ప్రసాద్ పాల్గొన్నారు.

### అన్నప్రసాద వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దాతలు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. బిర్రు సుధాకర్, జోగారావు, సాకేత్, కృష్ణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల: అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం దండుపేటలోని అయ్యప్ప ఆలయంలో భక్తులు అన్నదానం నిర్వహించారు. ఉదయమే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. హరి, శివ, మాల్యాద్రి, హిమగిరి, రమణ మూర్తి, బత్తుల శ్రీనివాస్, సాయిచరణ్, రాము, శ్రీకర్, సతీష్, రాజేష్, శ్యామ్, నరేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ వేడుకలు

హోలీ పండుగను సోమవారం ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆదివారం రాత్రే పలు ప్రాంతాల్లో కామదహనం నిర్వహించారు. యువత ఇంటింటికీ తిరుగుతూ తమ స్నేహితులు, బంధువులకు రంగులు పూశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా.. రాజకీయ, వ్యాపార, అధికార.. తదితర అన్ని వర్గాల ప్రజలు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గుంపులు, గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకుని కేరింతలు కొట్టారు. కాగా, ప్రకృతి సిద్ధమైన రంగులనే వాడాలని పలువురు ప్రచారం చేయగా.. కొందరు వాటినే వినియోగించారు. హోలీ పండుగ సందర్భంగా వాడవాడనా సందడి నెలకొంది.

-సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్ (కొత్తగూడెం): చిన్నారులతో కలిసి హోలీ ఆడుతున్న కలెక్టర్ ప్రియాంక అల



కొత్తగూడెంఅర్బన్: రంగు పూసుకుంటున్న ఉద్యోగులు



పాల్వంచ: బంజారా భవన్ వద్ద హోలీ వేడుక



సింగరేణి(కొత్తగూడెం): గౌతంపూర్ కాలనీలో..



ఇల్లెందు: హోలీ వేడుకల్లో ఇల్లెందు పట్టణవాసులు



పాల్వంచ: జయమ్మకాలనీలో హోలీ సందడి



టేకులపల్లి: కేజీబీవీ పాఠశాలలో..



జూలూరుపాడు: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



సుజాతనగర్: రంగులు చల్లుకుంటున్న దృశ్యం



రంగులు పూసుకుంటున్న మహిళలు



కొత్తగూడెంటౌన్: మహిళల హోలీ సంబరాలు



కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌లో చిన్నారుల కేరింత



చుంచుపల్లి: విద్యానగర్‌లో వేడుకల్లో యువకులు



ఇల్లెందు: ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి జీఎం జాన్



ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో ..



కొత్తగూడెంరూరల్: పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో..



జూలూరుపాడు: అనంతారం గ్రామంలో..



పాల్వంచరూరల్: సత్యనారాయణపురం గ్రామంలో..



టేకులపల్లి: ముర్రుట్ల గ్రామంలో..



ఇల్లెందు: కామ దహనం చేస్తున్న మార్వాడీలు



పాల్వంచరూరల్: పాండురంగాపురంతండాలో..



కొత్తగూడెంటౌన్: గణేశ్‌బస్తీలో చిన్నారుల సందడి

# మజ్జిగ, పండ్లు పంపిణీ

కొత్తగూడెంరూరల్: భద్రాచలానికి గోటి తలంబ్రాలు తీసుకొని వెళ్లే భక్తులకు ఇండియన్ స్కౌట్స్, గైడ్స్ ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో సింగరేణి గెస్ట్ హౌజ్ రోడ్డు ఎదురుగా పోచమ్మగుడి వద్ద మజ్జిగ ప్యాకెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షులు తోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసీం, ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నీసా, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్వేత, కోశాధికారి సోనా, జిల్లా ముఖ్య సలహాదారులు కనకదుర్గ, ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ స్కూల్ హెచ్‌ఎం జ్యోతిరాణి, బొడ్డు శ్రీనివాస్, విజయ్‌కుమార్, జానకీ, కల్యాణి, బొడ్డు కవిత, ఉమ, అంజమ్మ, లత తదితరులు ఉన్నారు.



మజ్జిగ, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

జూలూరుపాడు: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కాకర్ల, జూలూరుపాడు, కరివారిగూడెం గ్రామాల్లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాకర్ల గ్రామ సమీపంలో గల పాలగుట్టపై ఆలయంలో కొలువుదీరిన శ్రీరుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి వారి కల్యాణాన్ని శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాకర్ల శ్రీ రుక్మిణీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం ఎండోమెంట్ పరిధిలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను ఆలయ ఈఓ హరి చంద్రశేఖర్ సమర్పించారు. స్వామి వారి కల్యాణం సందర్భంగా విద్యుత్‌దీపాలతో పాలగుట్ట ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాల వెలుగుల్లో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వేలాది మంది భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఆలయ చైర్మన్ అల్లాడి నరసింహారావు, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, శ్రీ కృష్ణ సేవా సమితి చైర్మన్ అల్లాడి లింగారావు, సభ్యులు ఢిల్లీ వెంకటేశ్వర్లు, చెరుకుమల్ల కృష్ణయ్య, ఉడుతా వెంకటేశ్వరరావు, చెవుల కృష్ణారావు, వందనపు సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కాకర్లలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఊరేగింపుగా తలంబ్రాలు తీసుకొస్తున్న భక్తులు

# ఉత్పత్తిలో రారాజు కొత్తగూడెం

- సింగరేణి సంస్థ లక్ష్యంలో 20 శాతం బొగ్గు ఇక్కడి నుంచే..
- ఈ ఏడాది 18 రోజుల ముందుగానే లక్ష్యసాధన



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఈ నేపథ్యాన ఇంకో వారం సమయం ఉండగా, ఇప్పటివరకు 66.90 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. అయితే, ఇందులో కొత్తగూడెం ఏరియా 134 లక్షల టన్నులకుపైగా ఉత్పత్తి నమోదు చేయడం విశేషం. అంతేకాకుండా ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని 18 రోజుల ముందుగానే (ఈ నెల 13 నాటికి) సాధించింది. సీఎండీ, డైరెక్టర్లు, అధికారుల మార్గదర్శకత్వంలో నెలల వారీగా లక్ష్యాలను నిర్దేశించగా వర్షాకాలంలో సైతం లక్ష్యాలను అధిగమించిన కార్మికులు అధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఆర్థిక సంవత్సరంలో ఒకటి, రెండు నెలలు మినహా ప్రతీసారి లక్ష్యాన్ని అధిగమించడమే కాక రవాణాలోనూ ముందంజలో నిలిచి ప్రమాద రహిత అవార్డు అందుకునే దిశగా సాగుతోంది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2024 - 25) ఈ ఏరియాలో 157.50 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు, కార్మికులు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు.

**80 ఏండ్లలో అత్యంత ఉత్పత్తి..**

కొత్తగూడెం ఏరియా సుమారు 80 ఏండ్ల కిందట అనగా 1944లో ఏర్పడింది. తొలినాళ్లలో ఆర్థిక సంవత్సరమంతా కలిపి 10 లక్షల టన్నుల బొగ్గును తట్టా, చెమ్మస్ ద్వారా ఉత్పత్తి చేసేవారు. ఆ తర్వాత యాంత్రీకరణ జరిగినా 50 లక్షలు, 80 లక్షల టన్నుల ఉత్పత్తి జరగగా.. కొద్దికొద్దిగా పుంజుకుంటూ ఈ స్థాయికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం 131 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**ఈ ఏడాది నెలల వారీగా లక్ష్యసాధన (టన్నుల్లో)**

| నెల | లక్ష్యం | ఉత్పత్తి | శాతం | రవాణా చేసిన బొగ్గు |
|---|---|---|---|---|
| ఏప్రిల్-23 | 10,46,500 | 11,37,487 | 109 | 12,61,950 |
| మే | 10,46,500 | 11,52,938 | 110 | 13,49,745 |
| జూన్ | 10,41,500 | 11,74,340 | 113 | 12,78,701 |
| జులై | 10,51,500 | 10,74,565 | 102 | 12,21,947 |
| ఆగస్ట్ | 9,71,500 | 11,38,876 | 117 | 13,48,610 |
| సెప్టెంబర్ | 9,71,500 | 10,82,523 | 111 | 12,37,705 |
| అక్టోబర్ | 11,23,500 | 10,81,887 | 96 | 12,30,407 |
| నవంబర్ | 11,51,500 | 10,95,872 | 95 | 12,35,589 |
| డిసెంబర్ | 11,51,500 | 11,94,250 | 104 | 13,50,102 |
| జనవరి-24 | 11,51,500 | 11,57,253 | 100 | 12,93,409 |
| ఫిబ్రవరి | 10,91,500 | 11,52,000 | 106 | 11,48,651 |
| మార్చి (23వ తేదీ వరకు) | 9,90,900 | 10,56,890 | 110 | 10,56,890 |
| మొత్తం | 1,27,89,400 | 1,34,98,881 | 106 | 1,50,13,716 |

**అధికారుల సహకారం, కార్మికుల కృషితోనే..**



సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియాకు ప్రత్యేక స్థానం ఉంది. అధికారులు సమష్టిగా ప్రణాళికలు సిద్ధం చేసి, వాటి సాధనకు కృషి చేయడంతో గత కొన్నేళ్లుగా ఉత్పత్తిలో ముందంజలో నిలుస్తోంది. ఈసారి కూడా లక్ష్యానికి మించి ఉత్పత్తి నమోదు చేయడాన్ని కార్మికులు, అధికారుల సమష్టి కృషిగా భావిస్తున్నాం. భవిష్యత్‌లోనూ ఇలాగే కష్టపడి 11 ఏరియాల్లోనే ముందు వరుసలో ఉండేలా చూసుకుంటాం. కార్మికులు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నందున వారికి అన్నివిధాలా అండగా నిలుస్తాం. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తాం.

–శాలేంరాజు, ఏరియా జీఎం

# మమ్మల్ని అడ్డుకునేదెవరు?

- జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా సెల్లార్లు..
- అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- మున్సిపల్ అధికారుల చర్యలు శూన్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం ఏ-గ్రేడ్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతులు లేకున్నా కూడా ఎలాంటి భయం లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. భవిష్యత్‌లో వాటి వలన ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా కూడా ప్రస్తుతం వారి స్వలాభం కొరకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. అసలు మమ్మల్ని అడ్డుకునేదెవరనే ధీమాతో యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పట్టణవాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో జీ-ప్లస్ టూ భవనాలు నిర్మించేందుకు అనుమతులున్నాయి. అంతకన్నా ఎక్కువ అంతస్తులు నిర్మిస్తే డీఎంఏ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే జీ-ప్లస్ టూ అనుమతులను మున్సిపాలిటీ నుంచి తీసుకున్న తరువాత నిర్మాణాలు చేపట్టాలి. కానీ, అనుమతులకు దరఖాస్తులు చేసుకొని అవి రాకముందే దరఖాస్తు చేసుకున్న దాని కన్న ఎక్కువ అంతస్తుల నిర్మాణాలు కొందరు కానిచ్చేస్తున్నారు. వీటితో పాటుగా భవనాలకు సంబంధించిన సెల్లార్లకు కూడా మున్సిపాలిటీ నుంచి అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలి. అనంతరం నిర్మాణ పనులు మొదలు పెట్టాలి. వీటితో పాటుగా బిల్డింగ్‌కు సెట్ బ్యాక్, ఫైర్ ఇంజన్ బిల్డింగ్‌కు మూడు వైపులా తిరిగే విధంగా తప్పనిసరి స్థలం ఉండే విధంగా చూడాలి. కానీ, అవేవి లేకుండానే కొత్తగూడెంలోని కొందరూ యథేచ్ఛగా నిబంధనలను తుంగలో తొక్కుతూ నిర్మాణాలు చేస్తున్నారు. అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణాల వలన భవిష్యత్‌లో ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నిబంధనలు పాటించకపోవడం వల్ల బిల్డింగ్‌లలో అగ్ని ప్రమాదాలు జరిగి ఆస్తి, ప్రాణనష్టం జరుగుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ సెంటర్‌లో ఓ భవనానికి సంబంధించి సెల్లార్ నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం



గణేశ్‌బస్తీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

**కొన్ని ఇలా..**

- కొత్తగూడెంలో అనుమతులు లేకుండా నిర్మాణమవుతున్న బహుళ అంతస్తులు ఎన్నో ఉన్నాయి. వాటికి మున్సిపల్ టీపీఓ విభాగం వారు సహకరిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.
- కొత్తగూడెంలోని గణేశ్‌బస్తీలో నాలుగు అంతస్తుల నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. సెట్ బ్యాక్ తీసుకోకుండా నిర్మాణం చేయడం, బిల్డింగ్‌కు మూడు వైపులా ఫైర్ ఇంజన్ వెళ్లె మార్గం లేకపోవడం, సెల్లార్ కూడా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారు.
- పట్టణ పరిధి గొల్లగూడెం భవాని బార్ ఎదురుగా నిర్మించిన బహుళ అంతస్తు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉంది. మున్సిపల్ అనుమతులు తీసుకోకుండా, సెట్ బ్యాక్, సెల్లార్ అనుమతులు లేకుండా నిర్మించారు. ఈ బిల్డింగ్ వివరాలను మున్సిపల్ టీపీఓ సెక్షన్ వారు చెప్పేందుకు కూడా ఇష్టపడటం లేదు.
- పట్టణ పరిధి బస్టాండ్ సెంటర్‌లోని ఓ లాడ్జ్ వెనుక భాగంలో నిర్మించిన బిల్డింగ్‌కు మున్సిపల్ అనుమతులు పూర్తి స్థాయిలో లేవు. ఫైర్ అనుమతులు పూర్తిగా లేవు. అయినా కూడా బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేశారు. ఆ యజమానే ప్రస్తుతం పక్కనే మరో బహుళ అంతస్తుల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నారు. అందుకోసం మొదట సెల్లార్ నిర్మాణం చేపట్టేందుకు గానూ తవ్వకాలు ప్రారంభించారు. దీంతో చుట్టు పక్కలవారు గమనించి, సెల్లార్ల వలన ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, నిర్మాణాన్ని నిలిపివేయాలని కొద్దిరోజుల కిందట యజమానితో గొడవకు దిగారు. అయినా కూడా నిర్మాణ పనులు ఆపకుండా యథేచ్ఛగా సాగుతున్నాయి.

ఈ విషయంలో మున్సిపల్ టీపీఎస్ ప్రభాకర్‌ను వివరణ కోరగా బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రోడ్డు పక్కన నిర్మాణం చేపడుతున్నవాటికి సెల్లార్‌కు అనుమతులు లేవని తెలిపారు. అనుమతులు తీసుకోకుండా నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.